క్లుప్తంగా

బీఎల్‌ఓ విధుల నుంచి తప్పించండి



వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు

బొబ్బిలి: తమను బీఎల్‌ఓ విధుల నుంచి తప్పించాలని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు కోరుతున్నారు. ఇదే విషయమై సోమవారం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి, ఎంపీడీఓ పోతుల రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సంక్షేమ పథకాల అర్హుల గుర్తింపు, ఇతరత్రా సచివాలయ విధులు తమకు ఉన్నాయని, అదనంగా బీఎల్‌ఓ విధులు అప్పగించడంతో సమయం సరిపోవడం లేదని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

డిజిటల్ శిక్షణతో మెరుగైన బోధన



మాట్లాడుతున్న డిజిటల్ శిక్షణ కోర్సు డైరెక్టర్ మురళీకృష్ణ

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు ఉత్తమమైన బోధనా పద్ధతులు అవలంబించి, మెరుగైన విద్యాబోధన చేసేందుకు అవకాశం ఉంటుందని డిజిటల్ శిక్షణ కోర్సు డైరెక్టర్ ఆర్.మురళీకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక పట్టణంలోని జీఎంఆర్ఐటీలో జరుగుతున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్ శిక్షణ(రెండో బ్యాచ్)ను ప్రారంభించారు. డిజిటల్ టెక్నాలజీ ఉపయోగించి, బోధనలోని మెలకువలను ఉపాధ్యాయులకు వివరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు బాగా రాణించాలంటే డిజిటల్ టెక్నాలజీ ద్వారా బోధన అవసరమన్నారు. కార్యక్రమంలో ఫెసిలిటేటర్స్ కె.చంద్రునాయుడు, సీహెచ్ కృష్ణప్రసాద్, ట్రైనర్స్ సతీష్, రవికిశోర్, కోర్సు అదనపు డైరెక్టర్ గంగునాయుడు, రాజాం, సీతంపేట, వీరఘట్టం, జియ్యమ్మవలస మండలాలాల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

బొబ్బిలి: అడవితల్లినే నమ్ముకుని బతుకుతున్న తమను అడవి నుంచి అటవీ శాఖ అధికారులు వెళ్లగొడుతున్నారని, తమకు న్యాయం చేయాలని బాడంగి మండలంలోని ఆకులకట్ట ప్రాంత గిరిజనులు కోరుతున్నారు. ఇదే విషయమై సీపీఎం నేత ఎ.సురేష్‌తో కలిసి ఆర్‌డీఓ పి.శేషశైలజకు సోమవారం వినతిపత్రం అందజేశారు. బతుకు తెరువు కోసం సాలూరు మండలంలోని చింతమల గ్రామం నుంచి పోడు వ్యవసాయం చేసుకునేందుకు బాడంగిలోని ఆకులకట్ట అటవీ ప్రాంతానికి వచ్చి, పాకలు వేసుకున్నామని, అయితే అడవులను నాశనం చేస్తున్నామని అధికారులు తమను వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యాప్రమాణాలు మెరుగుపడాలి

రేగిడి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపడాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు అన్నారు. సోమవారం మండల రిసోర్సు కార్యాలయంలో పలు పాఠశాలల హెచ్ఎంలు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లతో సమావేశమైన ఆయన మనబడి నాడు-నేడు పనులపై తొలుత సమీక్షించి, పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు. యూ-డైస్ సక్రమంగా ఉండాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచాలని, డ్రాపౌట్స్ నివారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 బి.ఎరకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలోని ఆక్రమణలను అధికారులు సోమవారం తొలగించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఏర్పాటైన ఈ కాలనీలో విద్యుత్ హై టెన్షన్ వైర్లు ఉన్నచోట దాదాపు 40కు పైగా ఇళ్ల స్థలాలు రద్దు చేసి, వారికి వేరేచోట స్థలాలు ఇచ్చారు. ఆయా స్థలాలను ఇప్పుడు కొంతమంది ఆక్రమించుకోగా దీనిని గుర్తించిన అధికారులు ఆక్రమణలు తొలగించేందుకు సిద్ధం కావడం గమనార్హం.

గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు అందేలా చర్యలు

తెర్లాం: గ్రామ పంచాయతీల్లోని గ్రీన్ అంబాసిడర్లకు సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఈఓపీఆర్‌డీ రాంబాబు ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన వారు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించడంతో నిర్లక్ష్యం వహించవద్దన్నారు.

సుఖ ప్రసవాలపై అవగాహన

బాడంగి: గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని, ఇలా చేసుకోవడం ద్వారా సుఖ ప్రసవానికి అవకాశం ఉంటుందని గైనికాలజిస్ట్ అర్చన తెలిపారు. ఏంటినెటల్ డేలో భాగంగా స్థానిక సీహెచ్‌సీలో సుఖ ప్రసవాలపై గర్భిణులకు సోమవారం అవగాహన కల్పించారు. గర్భిణులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని, ఏవైనా లోపాలు ఉంటే వాటిని సరిచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జ్ కాశివిశ్వనాథం పాల్గొన్నారు.

ప్రతిఇంటా 'సంక్షేమ' సంతోషం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



చింతలపేటలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతిఇంటా సంతోషం నెలకొందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామారాయపురం పంచాయతీలోని చింతలపేట, షాలీపేట గ్రామాల్లో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి, ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. గతంలో చంద్రబాబు హయాంలో పథకాలు పేరుచెప్పి, ఆయన, ఆయన పార్టీ నాయకులు ప్రజాధనాన్ని దోచుకునే వారని విమర్శించారు. బాబు వస్తే జాబు వస్తుందని మభ్యపెట్టి, 2014 ఎన్నికల్లో గెలిచారని, తీరా గెలిచాక ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, ఆయన కొడుకు లోకేష్‌కు మాత్రం ఎన్నికల్లో గెలవకపోయినా మంత్రి పదవిని ఉద్యోగంగా గిఫ్ట్ ఇచ్చారని ఎద్దేవాచేశారు. ప్రస్తుతం అధికారంలోని తమ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతి హామీని నెరవేరుస్తోందన్నారు. ఇప్పటివరకు దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఒక్క సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మళ్లీ సీఎం జగనన్ననే ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహనరావు, ఎంపీటీసీ ఆర్. చిన్నమ్మడు, నాయకులు వై.శ్రీను, పి.మొయ్యిన్నాయుడు, పి.స్వాతికుమార్, మండల జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, ఎంపీడీఓ జి.వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



సంకిలిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని సంకిలి గ్రామసచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని, సాంకేతిక కారణాల వల్ల ఇంకా ఏ విధమైన సర్టిఫికెట్లు మంజూరు కాకపోయినా ఈ సురక్ష కార్యక్రమం ద్వారా అందజేయడం జరుగుతోందన్నారు. జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల సిటిజన్ సర్వీసులు అందించడం జరుగుతోందన్నారు. ప్రజలు కూడా ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలువురికి పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్‌మోహనరావు, సర్పంచ్ బి.పట్టాభి, ఎంపీటీసీ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీఓ డి.నాగమణి, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, దేవదళలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దుర్గమ్మ, ఎంపీటీసీ హరిరావు తదితరులు పాల్గొన్నారు.

712 ధ్రువీకరణ పత్రాలు సిద్ధం..

మెంటాడ: మండలంలోని చల్లపేట, కైలాం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఆయా గ్రామాల్లో మొత్తం 712 ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు



తెర్లాం: మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: మండల కేంద్రంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యలను మండల స్థాయి అధికారులంతా సకాలంలో వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కవిరాయునివలసకు చెందిన పలువురు గతంలో ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు నిర్మించామని, రెండు బిల్లులు అందాయని, మిగిలిన బిల్లులు చెల్లించలేదని, బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను కోరారు. స్పందించిన ఎంపీడీఓ గ్రామానికి వెళ్లి, పరిస్థితిని సమీక్షించాలని, ఇల్లు నిర్మించి, బిల్లుల చెల్లింపులు జరగకపోతే అవసరమైన చర్యలు తీసుకోవాలని మండల హౌసింగ్ ఏఈకి, ఉపాధి సిబ్బందికి సూచించారు.

సంతకవిటి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎంపీడీఓ జి.వి రవికుమార్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

బాడంగి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆంజనేయులు మాట్లాడుతూ స్పందనకు వచ్చే ప్రతీ సమస్యను పరిష్కరించాలని సూచించారు. అలాగే అన్ని గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ సత్యం, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యవసర సరుకుల పంపిణీ



అందుకున్న నిత్యవసర సరుకులతో దివ్యాంగులు

మెంటాడ: మండలంలోని గుర్ల, ఆగూరు, తమ్మిరాజుపేట, పిట్టాడ, ఇప్పలవలస, కె.ఎల్.వలస గ్రామాలకు చెందిన పలువురు దివ్యాంగులకు గజపతినగరానికి చెందిన గ్లోబల్ ఎయిడ్ సంస్థ అధ్యక్షురాలు బెల్లాన సాయిపద్మ నిత్యవసర సరుకులు సోమవారం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.వెయ్యి విలువైన సరుకులను అందజేశారు. దివ్యాంగులను చిన్నచూపు చూడకూడదని, వారిని మనతో సమానంగా గౌరవించాలని, అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించి, ప్రోత్సహించాలని దాత తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు షేక్ భాషా, పాండ్రంకి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రెయిన్‌కోట్ల వితరణ..

బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 15 మంది దివ్యాంగ విద్యార్థులకు రెయిన్ కోట్లు సోమవారం వితరణ చేశారు. లక్నోకు చెందిన చందన్ సింగ్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సందీప్, శాంతిశ్రీ వీటిని అందజేశారు.

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగవు

- జనసేన చీఫ్ పవన్ తీరుపై ఎమ్మెల్యే కంబాల జోగులు మండిపాటు



రాజాం సిటీ: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం సిటీ: వలంటీర్లపై జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా పనిచేసి, నిస్వార్థమైన సేవలందిస్తున్న వలంటీర్లపై నిస్సిగ్గుగా మాట్లాడడం ద్వారా పవన్‌కు ఎంత విజ్ఞత ఉందో రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని మండిపడ్డారు. నిరాధారమైన మాటలు ఆడే ముందు ఒకసారి ఆలోచించాలని హితవు పలికారు. గత ప్రభుత్వంలో పింఛన్ కావాలంటే అనారోగ్యంతో ఉన్నవారు సైతం క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి ఉండేదని, అటువంటి పరిస్థితి లేకుండా నేడు వలంటీర్లే నేరుగా ఇంటింటికీ వెళ్లి, పింఛన్లు అందిస్తున్నారని, ఈ విధానాన్ని దేశం మొత్తం హర్షిస్తోందన్నారు. ఇది చూసి ఓర్వలేకనే ఏదో ఒకరకమైన ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం మానుకోవాలన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా లంచాలకు తావులేదని, సిటిజన్ సర్వీసులు పొందుతున్న ప్రజలకు ఉచితంగా సేవల అందజేత జరుగుతోందన్నారు. కోవిడ్ విపత్తు సమయంలో వారి సేవలను దేశం మొత్తం చూసి, ప్రశంసించిందన్నారు. అటువంటి వారిపై ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసిన పవన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ టౌన్, రూరల్ కన్వీనర్లు పి.శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలనాయుడు, వై.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలు అర్థరహితం..

బొబ్బిలి: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని బొబ్బిలి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్లు ఖండించారు. సోమవారం సాయంత్రం ఇదే విషయమై స్థానిక పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళలంటే తనకు చాలా గౌరవమని చెప్పుకునే పవన్ మహిళా వలంటీర్లను ఉద్దేశించి, హ్యూమన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నారని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం ప్రజలను నిస్వార్థమైన సేవలందిస్తున్న వలంటీర్లకు సమాజంలో మంచి గుర్తింపు ఉందన్నారు. వలంటీర్ల ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు ఎంతో సంతృప్తికరంగా ఉన్నారన్నారు. మంగళవారం పవన్‌పై ఫిర్యాదు చేసేందుకు వేణుగోపాలస్వామి ఆలయం నుంచి ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్నామని, వలంటీర్లంతా ఉదయం 11 గంటలకు ఆలయం వద్దకు చేరుకోవాలని జేసీఎస్ బొబ్బిలి పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు కోరారు.

పొదుపు సంఘాల ఇంటర్నల్ ఆడిట్‌పై అవగాహన

రాజాం: డ్వాక్రా సంఘాల పుస్తకాలను ఆడిట్ చేయడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని వైఎస్సార్ క్రాంతి పథం రాజాం క్లస్టర్ ఏరియా కో-ఆర్డినేటర్ ఎ.చిరంజీవి అన్నారు. మండలంలోని వీఆర్ అగ్రహారం గ్రామం వద్ద రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి, తెర్లాం మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు, సీఎఫ్‌లు, వీఓలతో కలిసి పొదుపు సంఘాల ఇంటర్నల్ ఆడిట్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ఏసీ మాట్లాడుతూ ప్రతీ సంఘం పొదుపు పుస్తకాలు ఆడిట్ చేయడం ద్వారా ఆయా సంఘాల పొదుపు, అప్పులు వివరాలు క్షుణ్ణంగా తెలుస్తాయన్నారు. వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ లబ్ధిదారుల వివరాలు, ప్రభుత్వ పథకాలు అందని అర్హుల వివరాలు సమగ్రంగా బయటపడతాయని తెలిపారు. ప్రతీ సభ్యుని సమక్షంలో ఈ ఆడిట్ జరగడం ద్వారా సభ్యులకు సమావేశాల ఆవశ్యకత, పుస్తక నిర్వహణపై అవగాహన పెరుగుతుందన్నారు. ప్రతీ మండలంలో మూడు నుంచి నాలుగు టీంలు ఏర్పడి, మంగళవారం నుంచి ప్రతిరోజూ రెండు పంచాయతీల్లో ఆడిట్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు టి.దధికుమార్, ఎం.చక్రపాణి, టి.సీతారాం, టి.మంగమ్మ, పి.రాములు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ బాసూరి శంకరరావు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మంజూరు చేసిన ధ్రువీకరణపత్రాల వివరాలను ఆన్‌లైన్ చేసి ఉంచాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ధ్రువపత్రాలను వెంటనే మంజూరు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో పీఆర్ జేఈ ప్రభాకరరావు, వ్యవసాయాధికారిణి ఎ.రేణుకాసాయి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. సోమవారం మండలంలోని పిరిడి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజల బాగోగుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పరితపిస్తుంటారని, అందుకే ఆయన అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలుచేస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత ఆయనదేనన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలో ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. అలాగే ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మళ్లీ సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మి, జెడ్పీటీసీ ఎస్.శాంతకుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు బి.కాశినాయుడు, సర్పంచ్ టి.వరలక్ష్మి, ఎంపీడీఓ పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, స్త్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు

రామభద్రపురం: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు ఈ ఏడాది స్త్రీనిధి కింద రూ.157 కోట్ల రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, స్త్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో ఏరియా కో-ఆర్డినేటర్ లక్ష్మణనాయుడుతో కలిసి వీఓలు, వెలుగు సిబ్బందితో సమావేశమైన వారు రుణాలు ఇవ్వడం..రుణాల వసూళ్లపై దిశానిర్దేశం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు నుంచి రూ.లక్ష వరకు 92 పైసలు చొప్పున వడ్డీతో రుణాలు ఇస్తామన్నారు. ఈ రుణాలతో వ్యాపారాలు చేసుకుని, జీవనోపాధి మెరుగు పరుచుకోవాలన్నారు. సీడ్ కేపిటల్ స్కీం కింద రుణ మంజూరుకు లబ్ధిదారులను గుర్తించాలని, వైఎస్సార్ ఆసరా, చేయూత వంటి రుణాల మాదిరి ఈ ఏడాది నుంచి సీడ్ కేపిటల్ స్కీం కింద చిరు వ్యాపారులకు రుణాలు ఇచ్చేందుకు అర్హుల గుర్తింపు ప్రక్రియను వేగవంత చేయాలని సూచించారు. ఒక్కో మండలానికి 60 మందికి ఈ రుణాలు అందజేస్తామని, ఒక్కొక్కరికి రూ.40 వేలు చొప్పున 50 పైసలు వడ్డీతో రుణం మంజూరు చేస్తామన్నారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎం స్కీంల కింద 35 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. లబ్ధిదారు ఎంచుకున్న యూనిట్, అర్హతను బట్టి రూ.30 లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ రుణంతో ఐస్‌క్రీం పార్లర్, టెంట్‌హౌస్, డీజే సిస్టం, పిండి మిల్లులు, బెల్లం తయారు యంత్రం, బేకరీలు, ఎంబ్రాయిడరీ మిషన్ వంటి యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియో ఎఫ్‌టీఓ, నియామకపత్రం అందజేత



ఎక్స్‌గ్రేషియో ఎఫ్‌టీఓను అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి తదితరులు

రామభద్రపురం: మండలంలోని మామిడివలసకు చెందిన ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు చల్లా శంకరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియో నిధులకు సంబంధించిన ఎఫ్‌టీఓను ఆయన(మృతుడు) భార్య చల్లా సింహాచలంకు ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు చేతుల మీదుగా సోమవారం అందజేశారు. అలాగే మృతుడి కుమార్తె చల్లా హేమలతకు ఆ గ్రామ క్షేత్ర సహాయకురాలుగా నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన నియామక పత్రం అందించారు. కుల, మత, పార్టీలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఆ పార్టీ సానుభూతిపరులకే ప్రభుత్వ ఫలాలు అందేవన్నారు. అనంతరం వలంటీర్ వ్యవస్థపై జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే ఖండించారు. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు తీసుకువెళ్తున్న వలంటీర్లను హ్యూమన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నారని పవన్ కించపరచడం సరికాదన్నారు. చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్ చదవడం కాదని, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఎంతోమందికి ఎన్నో రకాల సేవలందుతున్నాయని, లబ్ధిదారులను అడిగితే తెలుస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, తమ పార్టీ నాయకులపై లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, బాడంగి జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యుఎస్ రాయులు, ఏపీఓ హరనాథ్, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాలచలంనాయుడు పాల్గొన్నారు.

దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

- మాజీ మంత్రి కోండ్రుపై మండల వైఎస్సార్ సీపీ నేతల ఆగ్రహం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుదర్శనరావు, ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: వైఎస్సార్ సీపీ నేతలపై దిగజారుడు మాటలు సరికాదని, అలా మాట్లాడితే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన వారు ఇటీవల టీడీపీ భవిష్యత్తుకు గ్యారంటీ-బస్సుయాత్రలో వంగర, మడ్డువలస వద్ద మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ మడ్డువలస ప్రాజెక్టులో పూర్తిగా నీటిని తొలగించి, మత్స్య సంపదను ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎమ్మెల్సీ, విజయనగరం మాఫియా దోచుకున్నారంటూ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మండిపడ్డారు. మడ్డువలస ప్రాజెక్టు తీర గ్రామాలైన కొప్పర, కె.చాకరాపల్లి, గీతనాపల్లి లోతట్టుగా ఉండడంతో వర్షాకాలంలో నీటమునిగే ప్రమాదం ఉందని, దీంతో ఆయా గ్రామాలు ముంపుబారిన పడకుండా ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని ప్రాజెక్టుకు రూ.1.80 కోట్లు మంజూరు చేసి, మరమ్మతుల కోసం అధికారులు నీటిని విడిచిపెట్టారని తెలిపారు. అది తెలుసుకోకుండా కోండ్రు తన ఇష్టారాజ్యంగా మత్స్యసంపద దోచుకుంటున్నారంటూ తమతో పాటు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లపై పరోక్ష విమర్శలు చేయడం నీతిమాలిన రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఇటువంటి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. మరమ్మతుల కోసమే అధికారులు ప్రాజెక్టులో నీరు తొలగించారని, 2012లో మీరు మంత్రిగా ఉన్నప్పుడు మడ్డువలస ప్రాజెక్టులో నీరు తొలగించి, ప్రాజెక్టు ఖాళీ చేయలేదా అప్పుడు నువ్వు ఎన్ని కోట్లు దోచుకున్నావని నిలదీశారు. నీ హయాంలో ప్రాజెక్టులో నీటిని తొలగిస్తే, మంచి కోసమని, మా హయాంలో తొలగిస్తే దోచుకోవడానికని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మండలంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రోడ్లు నిర్మించామని, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశామని, మరెన్నో సంక్షేమ పథకాలు ప్రజలకు అందించామని పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేక కేవలం ఉనికి కోసం ఇటువంటి అసత్యాలు ప్రచారం చేయాలని చూస్తే ప్రజలే మిమ్మల్ని అసహ్యించుకుంటారన్నారు. ఇప్పటికే నీచ రాజకీయాలు చేసి, మండలాన్ని నాశనం చేశారని, పూటకో పార్టీలో ఉండి, నైతిక విలువలు కోల్పోయి ప్రవర్తిస్తే ప్రజలు ప్రతిఘటిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.రమేష్, వైఎస్సార్ సీపీ నేతలు బి.వెంకటఅప్పలనాయుడు, బి.వెంకటరావు, కె.శ్రీనివాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా సోషల్ ఆడిట్

రామభద్రపురం: మండలంలో ఉపాధి హామీ పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్ పక్కాగా నిర్వహించాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సూచించారు. సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్‌పర్సన్ ఎం.మాధవ్ ఆధ్వర్యంలో ఆడిట్ బృందం ఎంపీపీని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసింది. మండలంలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 31 మార్చి వరకు రూ.14.63 కోట్లతో పనులు జరిగాయని, వీటికి సంబంధించి ఆడిట్ చేయనున్నామని బృంద సభ్యులు తెలిపారు.

బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదు

రాజాం సిటీ: తన బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని సాలూరు పట్టణానికి చెందిన వడ్డాది కుమారి ఫిర్యాదు చేసిన మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కె.రవికుమార్ సోమవారం తెలిపారు. ఈ నెల 7న రాజాంలోని తన బంధువుల ఇంటికి వచ్చిన కుమారి 8వ తేదీన సాలూరు వెళ్లేందుకు స్థానిక బొబ్బిలి జంక్షన్‌లో రామభద్రపురం వెళ్లే ఆటో ఎక్కింది. అక్కడి నుంచి మరో ఆటోలో సాలూరు వెళ్లింది. ఆమెతోపాటు అదే ఆటోలో రామభద్రపురం వరకు మరో మహిళ కూడా ప్రయాణం చేసింది. కుమారి నిద్రలోకి జారుకోగా ఆమె బ్యాగులో బాక్స్‌తో పెట్టిన 5 తులాల బంగారు వస్తువులను ఆటోలో పక్కన కూర్చున్న మహిళ బ్యాగ్ కట్‌చేసి అపహరించింది. ఈ విషయం ఆలస్యంగా గమనించిన కుమారి రాజాం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.